# ✻ పనికిమాలిన పంతులు ✻

(కథానిక)

వి. యస్. అవధాని

ఎన్నోసార్లు ఆలోచించి చూశాడు వాడు. అంతే. తన బ్రతుకు అంతే. అది మారదు. మారడానికి వీలులేదు. మార్చడానికి ప్రయత్నం చేసి లాభంలేదు. కాని ఆ పంతులు ఉద్యోగం మానుకొని తను ఏమి చెయ్యగలడు? ఏమి చెయ్యలేడూ?

ప్రశ్న పరంపర ధారా వాహినిగా వస్తుంది. పంతులు ఉద్యోగం ఇంత అధ్వాన్నంగా ఎందుకు ఉన్నదీ? దాన్ని మార్చడానికి ఏమైనా వీలు ఉన్నదా? అని ఆలోచించి చూశాడు. ప్రతిసారీ ఏదో ఒక ఉపాయం కనుపించడమూ ప్రయత్నంచేసిన తరువాత అది విఫలం కావడమూ. తను తిరిగి దాలి గుంటలోని కుక్కలాగా అదే పంతులు ఉద్యోగంలో కూచోవడమూ జరుగుతున్నాయి.

వాడి సంగతి వాడికి బాగా తెలుసు అని అనడానికి చాలా నిదర్శనాలున్నాయి. చేతులో డబ్బు ఉన్నప్పుడు ఎక్కువ పొదుపుగా ఉండేవాడు. "ఇవాళ్ళనే జీతం వచ్చిందిగా సినిమాకి పోదాం రారా" అని నేనంటే—

"నీకేం నాయనా సినిమాలకీ పోతావు. నాటకాలకీ పోతావు. నాకో ఇద్దరు పిల్లలాయె. ఇంటి దగ్గర ఎట్లా గడుస్తుందీ" అనేవాడు. చేతులో డబ్బులు ఉన్నప్పుడు ఇంటిదగ్గర కాఫీ తాగి ఊరుకునేవాడు. ఇదంతా అట్లా ఉంచు. తనకు తన తండ్రి ఆర్థికంగా వసతి కలిగించలేదు కనుక తన పరిస్థితి యిలా ఉన్నది. ఇటువంటి దరిద్రపు పరిస్థితులే తన పిల్లలకు కలగకుండా ఉండేటందుకు తనకు వచ్చే అరవై రూపాయిలలో మూడువేల రూపాయలకు ఇన్సూర్ చేశాడు.

ఇవన్నీ వాడి సంగతి వాడికి బాగా తెలుసు ననేటందుకు నిదర్శనాలు.

వీడు చాలా జాగ్రత్త గలవాడు అని నేను అనుకునేవాణ్ణి. కాని వీడు ఇట్లా జాగ్రత్తగా ఉండడంవలన నాకు ఒక తమాషా కనుపించింది. అదివరకు వాడు పద్యాలు రాసేవాడు. మేము ఎవరమున్నా వాడితో నాలుగు రోజులు కలిసి తిరిగి కాస్త జలసాగా కాలం వెళ్ళబుచ్చితే చాలా హుషారుగా ఉండేవాడు. ఏ పార్కులోనో నలుగురం కూర్చుని ఉన్నప్పుడు చక్కటి పద్యాలు చెప్పేవాడు.

నేను వాడితో చాలాసార్లు ఇలా అనేవాణ్ణి:

నువ్వు అనవసరంగా నిన్ను హీనపరుచుకుంటున్నావురా మిస్టర్. ప్రతి దమ్మిడీ ఇలా లెక్కవేసుకుంటూ కూర్చోడం వలననే నీ తెలివి తేటలు ఎందుకూ కాకుండా పోతున్నాయి. కాస్త జలాసాగా ఉంటే నీ మనసు చురుగ్గా ఉంటుంది. దాంతో పాటు నీ పరిస్థితులు మారవచ్చు."

అందుకు వాడు ఇలా అనేవాడు:

"నేను జల్సాగా ఉండడం లేదని నువ్వు ఎందుకు అనుకుంటున్నావో నాకు తెలియదు. మొన్న నువ్వూ, రావూ, రంగడూ వచ్చినప్పుడు ఎంత కర్చు చేశాను? ఇంట్లో పాత పేక ఉన్నా కూడా కొత్తది తెచ్చానా?"

అవును నాకు ఈ సంగతి గుర్తు లేదు. నిజానికి వీడు అంత పొదుపయినవాడు కాదేమో. ఎందుకంటే నెలాఖరు వచ్చి మేం అందరం ఎక్కడున్నా పదీ పరకా అప్పు తెచ్చే రోజులలో వీడు సినిమాలకు పోయేవాడు. ఇంకా అటువంటి చిన్న చిన్న సరదాలు జరిపేవాడు.

వీడు మా తాలూకా ఉపాధ్యాయ సంఘానికి కార్యదర్శి తరువాత జిల్లా సంఘానికీ, రాష్ట్ర ఫెడరేషనుకూకూడా కార్యదర్శి అయినాడు. ఏ సంఘంలోఉన్నా వాడు ఇచ్చే ఉపన్యాసాలు ఒకే తీరుగా ఉండేవి. వీడి తీరు బహుశా ఇతర పంతుళ్లకు గిట్టదేమో. మరయితే వాడే ఎందుకు కార్యదర్శి అయినాడు?

దీనికి చాలా కారణాలు కనిపించినయి. మొదటిది వీడు మంచి వక్త. అంటే అక్కడక్కడ వాళ్లూ వీళ్లూ వాడిన పదజాలాన్ని

పేరుకువచ్చి చాలా తెలివిగా ఉపయోగిస్తూ అవసరమయిన చోటా అనవసరమయిన చోటా వారు అట్లా అన్నారు - వీరు అట్లా అన్నారు అంటూ ఒక రకమైన హాస్య ధోరణిలో మాట్లాడ గలడు.

రెండవకారణం ఏమంటే పంతులు ఉద్యోగంలో వీడి వంటివాళ్లు చాలామంది ఉన్నారు. వీడి మాదిరిగా చాలామంది పంతుళ్లు డబ్బుకు యిబ్బంది పడుతున్నారు. కనుక తమ వంటివాడొకడు తమ తరుపున కార్యవర్గంలో ఉంటే తమ పరిస్థితులలో ఏదన్నా మార్పు వస్తుందనే ఆశతో వీడికి ఓటు ఇచ్చేవాళ్ళు.

ఇహ మూడవకారణం ఏమంటే ఇంగ్లీషు వచ్చిన వాళ్ళదగ్గర సంస్కృతంలోనూ, తెలుగూ సంస్కృతం వచ్చిన వాళ్ళదగ్గర ఇంగ్లీషు కవులూ రాజకీయ నాయకులూ ఇలా అంటున్నారు అనీ వీడు అంటూండేవాడు. కొంత మందికి వీడి మాటలు అర్థంకాక వీడు గొప్పగా చదువుకున్నవాడు అని అనుకుని ఆయవంటి వాడికి ఉత్సాహం ఇవ్వడం అంటే ఇలా కార్యదర్శిని చెయ్యడమే అనుకునేవారు.

పోతే వాడు కృత్రిమంగా మాట్లాడడం తెలియనివాడు. నిజానికి అలా మాట్లాడడం తమ ఉద్యోగానికి చాలా అవసరం అని పంతుళ్ళందరికీ తెలుసు. కాని వీడు నిజం బద్దలుచేస్తూ నిర్మొహమాటంగా మాట్లాడితే ఏదన్నా కొంత ఉపకారం జరుగవచ్చు అనే ఆశతో వాడినే తమ నాయకుణ్ణిగా చూసేవాళ్లు.

తన అవస్థలు వెలిబుచ్చడానికిగాను వాడు చెప్పే మాటలు ఉపన్యాసాలయి కూర్చున్నయి. ఉపన్యాసాలు వాణ్ణి నాయకుణ్ణి చేసినయి. నాయకత్వానికి కావలసిన లౌక్యం మాత్రం వాడికి అబ్బలేదు. కాబట్టి వాడికి సుఖం మాత్రం కనుపించదు.

సుఖం సంపాయించాలని వాడు చేసే పనులు వాడికి ఇబ్బందులు తెచ్చిపెట్టేవి. ఇటువంటి పంతులు-వాడికి మేం అందరం అదే పేరు పెట్టాము- ప్లీడరుగారి అబ్బాయికి ప్రయివేటు చెప్పడానికి ఒప్పుకున్నాడు. మా ఊళ్లో ప్లీడరుగారివంటి నిష్కర్ష మనిషి ఇంకొకడులేడు. ఆయనతో మంచిగా ఉండడం యెంత సుఖమో చెడుగా ఉండడం అంతకన్న ఎక్కువ కష్ట కారణం. ఈ మాట నేను ఎంత చెప్పినా వినక ఆ ప్రయివేటు కుదుర్చుకున్నాడు.

అంతటితో ఆగక ఆ అయిదేండ్ల పిల్లవాడితో పార్కుకి, సినిమాకి వెళ్లేవాడు. ఆ పిల్లవాడు ఇంట్లో తల్లి తండ్రులమాట వినడు. పంతులు పోయి "రామూ, యిలా చెయ్యరాదు" అంటే మంత్రముగ్ధసర్పంలాగా ఆ పిల్లవాడు అన్ని పనులూ సరిగ్గా చేసేవాడు.

ప్లీడరుగారికి లేక లేక కలిగిన సంతానం రాము. కావడంచేత వాణ్ణి ఒకరకమైన గారాబంతో పెంచేచారు. వాడు ప్లీడరు గారాబం కారణంగా పెంకితనానికి అలవాటు పడ్డాడు.

పంతులు ఇంటికి వచ్చి వాడు చదువుకోవాలి. పంతులు వాడికి అతి శ్రద్ధగా అక్షరాలు దగ్గర ప్రారంభించి అయిదో తరగతిదాకా చదువు చెప్పాడు. ఇదంతా ఒక సంవత్సరంలోనే! తన కొడుక్కి చదువు రాదని భయపడ్డ ప్లీడరుగారికి ఇది చాలా సంతోషకారణ మయింది. దానికి తగినట్టుగానే ఆయన పంతులుకి ముట్ట చెప్పేవాడు. ఈ అనుభవాన్ని వాడుకుని పంతులు తన ఉపన్యాసాలను ఇంకా జోరుగా సాగించేవాడు.

ఇలా ఉండగా మేమందరం కలిసి పంతులుకి ఒక కొత్త ఉద్యోగం సంపాయించి పెట్టాం. అందులో రాబడి చాలా ఎక్కువగా ఉంటుంది. రాబడి అంటే చేతివాటు రాబడికాదు. పంతులు కష్టపడినకొద్దీ జీతం ఎక్కువవుతుంది. ఉద్యోగం సంగతి చెపితే పంతులు ఇలా అన్నాడు:

"అక్కడికి ఎప్పుడు వెళ్లాలి?"

"ఎప్పుడేమిటి? ఇవాళ్లనే రాత్రి మెయిలుకి వెళ్లాలి."

"మాట్లాడవేం? పంతులు ఉద్యోగం వదల బుద్ధి కావడం లేదా?"

"పంతులు ఉద్యోగం..."

"అందుకే చెప్పేది. డబ్బుకోసం అనుమానించకు. మూర్తి వందరూపాయిలు ఇస్తానన్నాడు. అది తీసుకుని ప్రయాణం..."

"ఇంత తొందర అయితే ఎట్లాగురా?"

"అదే నీ పొరపాటు. నీకోసం అవకాశాలు వెదుక్కొంటూ రావు. వచ్చిన అవకాశాలను నువ్వు వాడుకోవాలి అంటే."

కాలం ఇంత త్వరగా ఎందుకు ప్రవహిస్తున్నదో నాకు తెలియదు. మార్పులు ఇంతవేగంగా ఎందుకు వస్తున్నవో నాకు తెలియదు. అసలు మారడం దేనికో నాకు తెలియదు. మారుతున్నదని నేను అనుకుంటున్నాను, అందరూ అనుకుంటున్నారు. ఆ అనుకోవడానికి ఆధారం ఏమిటో చాలామందికి తెలియదు. ఒకవేళ తెలిసినా ఆ ఆధారంకూడా మారుతుందని వారికి చెబితే ఇదంతా మీతర్కం అంటారు. లేకపోతే పోయేకాలం అంటారు. కాలం అంటే ఏమిటని అడిగితే చప్పరిస్తారు, లేదా అట్లా అడిగినవాడికి ఒకరకమైన పిచ్చి ప్రారంభమయింది అనుకుంటారు. అవసరమైనపుడు బహిరంగంగానే అంటారు. వారికి తోచిన ఆ అవసర సమయం మాత్రం మారదు కాబోలు.

ఏమిటో వెర్రి ఆలోచనలు. మన ఆలోచనలు తెగేదాకా ఏదీ ఆగదు. ఇందాకా ఆలోచిస్తూనే ఉన్నాను. ఇంతలో ఆ గాలీ దిద్దారా అన్నాడు రావు.

దిద్దలేదు. కాని "ఆఁ దిద్దాను" అని చెప్పి మళ్లీ ఇంతలో రంగంలోకి దిగుదామని అనుకుంటున్నాను. ఇంతలోనే "మీకు టెలిగ్రాం సార్" అన్నాడు ఆఫీసు బాయ్.

"పంతులుకి టైఫాయిడ్ వచ్చిందట" అన్నాను మూర్తితో.

"వెంటనే వెళ్లి నాలుగు రోజులుండి చూసిరా" అన్నాడు మూర్తి.

"నేను వెళ్లి ఏంచేస్తాను? మీరు వెళితే ఏమయినా-"

"నేను నాలుగు రోజులదాకా కదలడానికి వీలులేదు. కాదు. పని చాలా ఎక్కువగా ఉంది. హోమియో మందులు తీసుకు వెళ్లు. అవసరం అయితే డాక్టరు సుబ్బారావును తీసుకువెళ్లు" అంటూ మూర్తి వెళ్ళిపోయినాడు.

* * *

పంతులు దగ్గరకు వెళ్ళాను. వాడి మొఖం చూస్తే వాడికి జబ్బేమీ ఉన్నట్లు కనుపించలేదు కాని కార్పొరేషను డాక్టరు టైఫాయిడ్ అని యింజక్షనులు ఇస్తున్నాడు. పంతులు కళ్లు తెరుచుకుని మంచంమీద వెలికిలా పడుకుని ఉన్నాడు. కాని నాతో పలకలేదు. పిలిచినా లాభం లేకపోయింది. ఆకలి ఐనప్పుడు మాత్రం లేచి కూచుంటాడు.

ఎవరో ఒకరు ఇంత పండ్లరసం ఇస్తారు. అది తాగి మళ్ళీ అట్లానే పండుకుంటాడు. తనకు తానే పోయి కాలకృత్యాలు తీర్చుకుంటున్నాడు.

ఇక వీడికి జబ్బు ఎక్కడా? డాక్టరు దేనికి మందు ఇస్తున్నాడు? అసలు వీడికి జబ్బు చేసిందని భావించడం ఎలా?

థర్మామీటరు మాత్రం 104 డిగ్రీలు చూపుతున్నది. ఇలా ఇరవయి రోజులనుంచి.

రాత్రిళ్ళ మాత్రం తెగ కలవరిస్తాడట. అడ్డం వచ్చినవాళ్ళను కొట్టడానికికూడా సిద్ధమేనట.

నాకు తెలిసిన హోమియో పుస్తకాలన్నీ తిరగవేశాను. పగలంతా ఆలోచించాను. సుబ్బారావు దగ్గరకుపోయి సంగతంతా చెప్పాను.

రాత్రి ప్రారంభమయింది. గదిలో లైటు వెలుగుతోంది. ఫాను గిరగిరా తిరుగుతోంది. నా అవస్థ సంగతి రాత్రికి తెలియదు. ఈ ఫానుకు అంతకన్నా పట్టలేదు. పైగా ఆరోజు అమావాస్య. రోగులకు అమావాస్య పెద్దగండపురోజని అమ్మ చెప్పింది. నేను ఏమి చెయ్యాలో నాకు తెలియడంలేదు.

మూర్తి నన్ను ఇక్కడికి ఎందుకు పంపించాడని బలే కోపంవచ్చింది. నేను చూస్తూండగానే ఈ పంతులు గోవింద కొడితే నేనేం చేసేటట్లు?

ఉన్నవాడున్నట్లుండి ఒక్క కేక వేశాడు పంతులు. మొదట్లో హడలిపోయాను. మిగతా వాళ్ళందరికీ ఇది మామూలయింది.

"అబ్బ...బ్బ. నేను..." పంతులు కలవరిస్తున్నాడు.

"ఇక్కడికి ఎందుకు వచ్చారు. తాతాజీ... తాతాజీ...వస్తున్నా నువ్వూ నేనూ ఒక్కటి."

నాకు కొంచెం దోవ దొరికింది. ఈ పంతులు తాతాజీ అనే వాడికోసం దిగులుపడ్డాడు. కాని ఈ తాతాజీ ఎవడో నాకు తెలియదు.

మర్నాడు మూర్తికి తాతాజీ అనేవాణ్ణి తీసుకుని వెంటనే బయులుదేరి రమ్మని రాశాను. ఆ తాతాజీ ఎవరో ఆయనకు మాత్రం ఎట్లా తెలుస్తుందన్న అనుమానం నాకు తోచలేదు. ఆ పరిస్థితి అలాంటిదే నేమో!

రెండురోజులు గడిచినయి. మూడవరోజున మూర్తీ, ప్లీడరుగారూ, ఆయనకొడుకూ దిగారు. ప్లీడరుగారు ఆయన పిల్లవాణ్ణి వెంట పెట్టుకుని ఎక్కడికో వెళ్లాడు. మూర్తి ఒంటరిగా ఉండడం చూసి ఇలా అన్నాను:

"ఈ ప్లీడరుగారిని తీసుకువచ్చారు దేనికి?"

మూర్తి పలకడు తొణకడు. ఆయన ధోరణే అంత. పట్టించుకుంటే అంతా నెత్తిన రుద్దుకుంటాడు. మళ్ళీ అంతలోనే మరచిపోగలడు.

* * *

మరునాటి రాత్రి. ప్లీడరుగారు మేడమీద పడుకున్నాడు. నేను పంతులు మంచం ప్రక్కన చాప వేసుకున్నాను. అవతల కుర్చీలో కూర్చుని మూర్తి చదువుకుంటున్నాడు.

ప్లీడరుగారి అబ్బాయి దూరంగా మంచం మీద పడుకుని నిద్రపోతున్నాడు.

"ఈ రోగి గదిలో ఈ పిల్లవాడు దేనికి?" అన్నా మూర్తితో. ఆయన పలకడు తొణకడు. ఒక్క ఈ విషయంలోనే-

మళ్ళీ పంతులు కేకవేశాడు. మూర్తి లేచి గబగబా పంతులు దగ్గరకువచ్చాడు. పంతులు కలవరింత ప్రారంభించాడు.

" తాతాజీ... తాతాజీ... వస్తున్నా... నేను అచ్చంగా పంతుల్నే. ఇంతకన్న నేను దేనికీ పనికిరాను" అన్నాడు బిగ్గరగా.

అరుపుకు ప్లీడరుగారి అబ్బాయి లేచాడు.

తాతాజీ అని పిలవగానే లేచి పంతులు మంచందగ్గరకు వచ్చాడు.

"మాస్టార్-మేస్టార్..." అని పిలిచాడు.

"తాతాజీ..."

పంతులు ఆ పిల్లవాణ్ణి దగ్గరకు తీసుకున్నాడు. వాడి రోగం సగం కుదిరింది. వట్టిభ్రష్టు! ఈ కాస్తకోసం నన్ను ఎంత బాధ పెట్టాడు!

రోజులు గడిచిన కొద్దికీ బలం వచ్చింది. ఆ ఉద్యోగం మానుకుని తిరిగి పంతులుగారు ఎప్పటి చోటికే వచ్చాడు.

"గుడుగుడు గుంజు గుండారాగం"—

# గ్రామసీమలు ప్రత్యక్ష నరకాలు

"గ్రామవాసి"

హిందూ దేశానికి గ్రామ జీవనం ఆయువు పట్టు. ఈ గ్రామాలనుంచే మన తిండి వసతులు వస్తున్నాయి. అధిక ఆహారోత్పత్తి గురించి మాట్లాడే ఈ రోజులలో ఉత్పత్తిచేసే కర్షకుల జీవనము ఎంత అనారోగ్యముగా ఉంటున్నదీ పరిశీలించడం న్యాయం. అయితే వారికి నిత్యమూ వచ్చే జ్వరాలగురించిగాని, వారి కష్టాల నన్నిటినిగాని చర్చించుట కష్టము. కాని కొన్ని చోట్ల వారి స్థితులు రోజురోజుకూ క్షీణించడము సంభవిస్తోంది. అటువంటి వాటిల్లో ఒకటి గోదావరిజిల్లాలలో ఫైలేరియా వ్యాధి. దీని వ్యాప్తి, నివారణోపాయాలు చర్చిస్తూ, దీనిని ఈ తరములోనైనా అఖరు చేయవలసిన అవసరాన్ని గుర్తింపచేయడం దీని ఉద్దేశము.

గ్రామాలలో శుభ్రత అనేది బొత్తిగా శూన్యము. ఏఒకరిద్దరైనా శుభ్రత పాటించినా వారితో సహకరించాలని ఇతరుల కుండదు రోడ్డు ఇరుకు. ఎండితే దుమ్ము. వర్షాకాలము రొంపిగా ఉంటాయి. ఇక మురికి కాలవలు వైతరిణీ నదులలా ప్రవహిస్తూ ఉంటాయి.

వాటిని శుభ్రముగా ఉంచడం, ఒకవార వాటినిపోనివ్వాలని గ్రామవాసులకి ఎవర్కీ తట్టదు. స్థలానికి యిబ్బంది లేకపోయినా యింటికిచుట్టూ ఖాళీ స్థలముతో విశాలంగా ఉండవు. లోపలికి వెళ్ళితే అంధకారం, చెమ్మ, గ్రామ పరిపరిసరాలన్నీ బహిర్భూములక్రింద మార్చివేస్తారు. ఉత్తర హిందూస్థానమునుంచి ఒక పెద్దమనిషి ఈ ప్రాంతములో ఉండడం సంభవించింది. మాటలలో తెలుగువారి గురించి మీ అభిప్రాయం ఏమిటన్నాను. "అన్నీ బాగున్నాయి కాని ఈ ఆంధ్రులకి సిగ్గు అనేది లేదు. గ్రామాలలో ఉదయం రోడ్డుమీద వెళ్లవలసివస్తే బాటసారి